# కరువు

చాలా సంవత్సరాల క్రితం ఒక రోజు నేను మా ఫ్యాక్టరీలో మంచిపనిలో ఉండగా "ఇంటి నుంచి ఫోనొచ్చింది. పెద్దమ్మగారు మాట్లాడుతారుట" అని అంటూ మా పిఏ నా చేతికి ఫోను ఇచ్చింది. పెద్దమ్మగారంటే మా అమ్మ చిన్నమ్మగారంటే మా అత్తగారు. ఫ్యాక్టరీ అమ్మ అంటే నేను. ఈ విధంగా మేం ముగ్గురమ్మలం మా సామ్రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండేవాళ్ళం అన్నమాట. మా అమ్మ సాధారణంగా నాకు ఫోను చేసేది కాదు. మా అత్తగారు మాత్రం కాఫీపొడి అయిపోయిందనో, రిజిస్టరు ఉత్తరం వచ్చిందనో, కరెంటు ఒక ఫేజు రావడం లేదనో ఏదో ఒక పని మీద రెండు మూడు సార్లు అయినా చేసేవారు. మా అమ్మ అలాంటి గృహనిర్వహణ సమస్యలు పట్టించుకునేది కాదు. ఎంతయినా ఆవిడకి మా ఇల్లు కూతురిల్లే కదా! అందుకని ఎంతలో ఉండాలో అంతలో ఉండాలని తరచూ అంటూ ఉండేది. తనకి చేతనయిన పనిచేసి ఏదో ఒక పుస్తకం చదువు కుంటూ ఉండేది. ఈ సమయంలో అంత అర్జెంటుగా ఆవిడ ఫోనెందుకు చేసిందా అనుకుంటూ ఫోను తీసుకుని "ఏమిటమ్మా" అని అడిగాను.

"రవి వస్తున్నాడుటే! ఇప్పుడే ఉత్తరం వచ్చింది" అంది. "ఎప్పుడట?" అన్నాను. "బహుశా మళ్ళీ నెల పదహారున. ఇంకా రిజర్వేషన్ కన్ఫర్మవలేదట. ఇంటికొచ్చాక నీతో కొంచెం మాట్లాడాలి" అంది.

"ఏం ఉంటాయిలే! నువ్వు నాకు చెప్పేవి. నేను వినవలసినవి. ఇంటికొచ్చాక మాట్లాడుకుందాం" అని ఫోను పెట్టేశాను.

రవి అంటే మా ఒక్కగానొక్క తమ్ముడు. నా కన్నా పధ్నాలుగేళ్ళు చిన్న. మా అమ్మా నాన్నలకి నలుగురు ఆడపిల్లల తర్వాత ఎన్నో పూజలు, వ్రతాలు చేశాక మురిపిస్తూ పుట్టిన గారాబాల కూచి. పాపం వాడు ఉద్యోగస్తుడవటం మా నాన్న చూడనే లేదు. రవి బాగా చదువుకుని ఎవరి సహాయ సహకారాలు లేకుండానే గవర్నమెంటులో పెద్ద ఉద్యోగం సంపాయించుకున్నాడు. పోస్టింగ్ మాత్రం అస్సాంలో, అందులోనూ ఎక్కడో అడవుల్లో. అప్పట్లో సెల్‌ఫోన్ల వాడకాలు, విమానాల్లో ప్రయాణాలు సామాన్యులకి అంతగా అలవాటవలేదు. అందుకే వాడు ఎప్పుడూ నాలుగు రోజులు ప్రయాణం చేసి రైల్లోనే వచ్చేవాడు. ఎక్కువగా ఫోన్లు చేసేవాడు కాదు. ఇన్లాండు కవరు మీద అమ్మపేరున నెలకొక ఉత్తరం వ్రాసేవాడు. దాన్ని ఆవిడ మళ్ళీ ఇంకో ఉత్తరం వచ్చేవరకూ భగవద్గీతలాగా

పారాయణం చేసేది. కొడుకంటే అంత ప్రేమెందుకని మా అక్కచెల్లెళ్ళు, మా పిల్లలు అందరం ఆవిడని వెక్కిరిస్తూనే ఉండేవాళ్ళం. కానీ ఆ విషయంలో మాత్రం మా ఎవరినీ ఖాతరు చేసేదికాదు.

రోజూ ఫ్యాక్టరీ నుంచి ఇంటికొచ్చాక ఎవరితోనూ ఏమీ మాట్లాడకుండా తిన్నగా నా గదిలోకి వెళ్ళిపోయి ఒక అరగంట మంచం మీద దొల్లడం నా కలవాటు. ఆ సమయంలో ఎవరూ నా జోలికి వచ్చే ప్రయత్నం చేయరు. కానీ ఆ వేళ మాత్రం మా అమ్మ మంచినీళ్ళ గ్లాసుతో నా గదిలోకి వచ్చి నీళ్ళు బల్లమీద పెట్టి కుర్చీ లాక్కుని కూచుంది. ఆవిడలా ఎందుకు చేస్తోందో మాత్రమే కాకుండా నాతో ఏం మాట్లాడాలనుకుంటోందో కూడా నాకు తెలుసు. రవి వస్తున్నాడని తెలియగానే ప్రతి ఆరు నెలలకీ జరిగే కథే ఇది. "ఉసిరికాయలేనా?" అని అడిగాను.

"అవునే! మీ రాజు గారి తోటలో చెట్టుకి ఎప్పుడూ కాయలుంటాయంటావు కదా! ఒక్క కిలో తెప్పిస్తే చాలు" అంది.

"ఏం బాగుంటుందమ్మా! నేను ఆయనని పలకరించి ఏడాదయింది. ఏవేవో సమస్యల్లో ఉన్నారుట. ఇప్పుడు ఉసిరికాయలకోసం పలకరిస్తే "ఏమను కుంటారు? చూద్దాంలే ఇంకా చాలా టైముంది. అయినా ఇంట్లో కొలువు తీరిన ఊరగాయలు చాలవా? నీకంతా చాదస్తం" అని కొంచెం విసుగ్గా అన్నాను. మా అత్తగార్ని నేను ఎంత విసుక్కున్నా ఆవిడేం పట్టించుకోరు. "సర్లే! నీ కోపం తగ్గాక మాట్లాడుకుందాం" అని వెళ్ళిపోతారు. కానీ మా అమ్మ అలా కాదు. నా గొంతులో చిన్న మార్పు కనపడితే నా మీద మూడు రోజులు అలుగుతుంది. అవన్నీ మా నాన్న చేసిన అలవాట్లు మరి. ఆవిడకలా జరిపారు. అమ్మ గబుక్కున కుర్చీ జరిపి లేచి మాట్లాడకుండా వెళ్ళిపోతుంటే "సర్లేవే! రేపు ఆయనతో మాట్లాడి డ్రైవరుని పంపి తెప్పిస్తాలే" అన్నాను. "ఫరవాలేదులే! నీకు వీలయితేనే చెయ్యి" అని బయటకు వెళ్ళిపోయింది.

వాడు రావడానికి ఇంకా పదిహేను రోజులు టైముంది. కానీ మా అమ్మ హడావిడి మొదలయింది. మా అమ్మకి కొన్ని గట్టి నమ్మకాలున్నాయి. రవికి ఉసిరావకాయ అంటే చాలా ఇష్టం అనీ, బీరకాయ ఉల్లికారం పెట్టి కూరచేస్తే చల్లారినా బాగుంటుంది కాబట్టి వాడేవేళప్పుడు వచ్చినా వీలుగా ఉంటుందనీ, పెరుగు పులిస్తే తినలేడు కాబట్టి సాయంత్రం అయిదు గంటలకి తోడు పెడితే 10 గంటలకి కమ్మటి పెరుగు తయారవుతుందనీ ... ఇలా రకరకాల ప్లాన్లు. వాడెప్పుడు వచ్చినా వారం రోజుల కన్నా ఉండడం కుదరదు. కొత్త ఉద్యోగం

కదా సెలవు దొరకదు. అంత కాస్త టైంలో ఈవిడ చేయాలనుకున్నవన్నీ తినడం వాడివల్ల అయ్యేపనేనా? మా అక్కచెల్లెళ్ళందరం "అమ్మా! మా కోసం ఎప్పుడయినా ఇలా చేశావుటే! కొడుకంటే మరీ అంత పక్షపాతం పనికిరాదు" అని గొడవపెట్టేవాళ్ళం. "పొండే! దొంగమొహాల్లారా! నేనేమీ చెయ్యకుండానే ఇంతవాళ్ళయ్యారు పాపం! తిన్నదంతా పరగడుపే! నా వయసొచ్చాక తెలి సొస్తుంది" అని మమ్మల్ని కసిరేది.

ఆ రోజుల్లో అస్సాం నుంచి ఆంధ్రాకు ఒకటే రైలుండేది. ఆ రైలుని విజయ వాడలో దిగి ఇంకో రైలో, బస్సో పట్టుకుని వాడేరాత్రి పదిన్నరకో వచ్చేవాడు. అప్పుడప్పుడు కలకత్తా వరకు వచ్చి అక్కడ నుంచి డైరెక్టుగా హైదరాబాదు వచ్చేవాడు. కాబట్టి కచ్చితంగా ఫలానా టైముకి వస్తాడని తెలిసేది కాదు. ఈవిడ మాత్రం వాడు రాసిన ఉత్తరం ఆధారంగా ఒక మూడు రోజులపాటు ఏవేళప్పుడు వస్తాడో అని అన్ని వేళల్లోనూ ఎదురుచూస్తూ ఉండేది. ప్రతిరోజూ వంటంతా చేసి (అందులో బీరకాయకూర తప్పనిసరి) బల్లమీద పెట్టించేది. రోజుకి మూడుసార్లు పెరుగుతోడు పెట్టించేది. వాడి రూములో దుప్పట్లన్నీ ఉతికించి - ఇస్త్రీ చేయించి రెడీ చేసేది. తను తెల్లవారకుండానూ, పొద్దుగూకగానేను స్నానంచేసి, మంచి చీరకట్టుకుని చక్కగా తయారయి చేతిలో పుస్తకం పట్టుకుని గుమ్మంలో ఎవ రొచ్చినా కనబడేలా కూచుని చదువుకుంటూ ఉండేది. ఆవిడలా లేకపోతే అమ్మకి ఆరోగ్యం బాగా లేదని దూరానవున్న కొడుకు దిగులు పడతాడుట పాపం. రోజూ 9 గంటలకే పడుకునే ఆవిడ పదిన్నరయినా పక్క సర్దుకునేది కాదు.

మాకెవరికీ రాలేదుగానీ మా అమ్మకి చాలా మంచి అలవాట్లుండేవి. ఎప్పుడూ ఇంట్లో ఉన్న ఆడవాళ్ళు పిల్లలు మంచి బట్టలు కట్టుకుని సంతోషంగా ఉండాలని, అలా చేస్తేనే లక్ష్మి నిలుస్తుందని ఆవిడ నమ్మకం. ఇంటికెవరయినా అతిథులు వచ్చినా రాకపోయినా ఒకేలాగా కళకళ్ళాడుతూ ఉండేది. ఎంత పని చేసినా బట్ట నలిగేది కాదు. జుట్టు చెదిరేది కాదు. ఇప్పుడాడపిల్లలు ఇంట్లో ఉన్నంతసేపు నైటీలతో తిరుగుతూ చాలా అందవిహీనంగా కనిపిస్తారు. చీర కట్టుకుంటే పని కుదరదనీ, అడ్డం వస్తుందనీ ఏవేవో వంకలు పెడతారు. అసలు నూలు చీరకన్నా సౌకర్యంగా ఉండే వస్త్రధారణ ఉందా? బయటకు వెళ్ళేటప్పుడు మాత్రం గంటల తరబడి సింగారించుకుంటేగానీ బయటకు అడుగుపెట్టరు. ఇంట్లో వాళ్ళ కర్మ. ఎప్పుడూ జిడ్డు మొఖాల్ని చూడాల్సిందే. ఎందుకంటే ముస్తా బయ్యాక క్షణం ఉండరు కదా ఇంట్లో!

మా అమ్మ మంచి మంచి టిఫిన్లు, స్వీట్లు చేయడంలో దిట్ట. ఓ రోజు నా కొడుకు ఆవిడ దగ్గర చేరి "అమ్మమ్మా! జాంగ్రీ చేయవా! చాలా రోజులయింది" అని గారాబంగా అడిగాడు. పాపం మా అమ్మ చాలా సంబరపడిపోయి "నా తండ్రే! తప్పకుండా చేస్తాగానీ నీకు జాంగ్రీ అంటే ఎప్పట్నించి ఇష్టం కలిగింది? ఇంక రెండు రోజులాగరా! రవి మావయ్య వచ్చేస్తాడుగా! రాగానే ముందు అదే చేసుకుందాం" అంది. వీళ్ళకి కాస్త దూరంగా నిలబడి సంభాషణ వింటున్న మా అమ్మాయి "తియ్యరా! రూపాయి తియ్యి. అక్కని, ఏడాది పెద్దదాన్ని చెప్తున్నానని గౌరవం లేకుండా నాతోనే కడతావూ పందెం?" అని వాణ్ని దబాయించింది. వెంటనే వాడూ, వాణ్ని తరుముకుంటూ అదీ పరిగెత్తుకుంటూ పోయారు. అంటే ఇంక మా ఇంట్లో జరగాల్సిన విశేషాలు, వండుకోవాల్సిన పిండివంటలూ అన్నీ రవి మావయ్య కోసం ఆగవలసిందేనన్నమాట.

అలా ఆవిడ ఎదురుచూడగా చూడగా వాడు రావడమూ, వారం రోజులిట్టే గడిచిపోవడమూ అయ్యేది. వాడున్నన్నాళ్ళూ ఇంటినిండా అమ్మవైపు బంధువులే! మా పిన్నిలూ, మావయ్యలూ, అత్తయ్యలూ అందరూ ఏదో ఒక టైంలో వచ్చి తొంగిచూసి వెళ్ళిపోయేవారు. పిల్లలందరికీ కనీసం ఒక హోటల్లో టిఫెన్లు తినే కార్యక్రమం, రెండు సినిమాలకి వెళ్ళడం ఉండేది. కానీ జీవితంలో మంచి మంచి సందర్భాలన్నీ ఎప్పుడో అప్పుడు ముగుస్తాయి కదా.

ఇలాంటి సందళ్ళు కొన్నిసార్లు జరిగాక మా అమ్మ ఇంతమంది పరివారాన్ని వదిలేసి, ఎక్కడున్నారో తెలియని మా నాన్నని వెతుక్కుంటూ పరలోకాలకి వెళ్ళిపోయింది. ఇంక ఆశలేదని చెప్పాక కూడా అంత దూరాన ఉన్న కొడుకు వచ్చేదాకా ఉగ్గపట్టుకుని ఉండి, వాడి చేతిలో సునాయాసంగా ప్రాణాలు వదిలింది. జరగవలసిన విధులన్నీ అయ్యాక వాడు తిరిగి వెళ్ళిపోయాడు. వెళ్ళేటప్పుడు "అమ్మలేకపోయినా ఆరునెలలకోసారి వస్తుంటాలే! నాకు మాత్రం ఎవరున్నారు అక్కా! మీ అందరిలో అమ్మని చూసుకోవడమేగా" అని బాధ పడ్డాడు.

చూస్తుండగానే ఏడెనిమిది నెలలు గడచిపోయాయి. అందరం రొటీన్లో పడి పోయాం. రోజుకొకసారయినా ఏదో ఒక సందర్భంలో అమ్మని గుర్తు చేసుకుని నవ్వుకోవడమో, బాధపడడమో చేసేవాళ్ళం. మా అత్తగారు చాలా డీలాపడిపోయి అన్నిటికీ నన్నే సలహాలు అడిగేవారు. ఆవిడ కొంచెం ఖాయిలా పడడంతో నాకు ఇంట్లో పని ఎక్కువయింది. కొందరు గిట్టనివాళ్ళు "కూతుళ్ళు బాగానే కోలు కున్నారుగానీ వియ్యపురాలు తేరుకోలేకపోతోంది" అని కామెంటు చేసేవారు.

మళ్ళీ రవి దగ్గరి నుంచి ఉత్తరం వచ్చింది. "అక్కా! మద్రాసులో కాన్ఫరెన్సుంది. నేను జనవరి ఆరవ తేదీ కల్లా వచ్చి పండగెళ్ళాక మద్రాసు వెడతాను. అత్తయ్య గారి ఆరోగ్యం ఎలా ఉంది?" అని వ్రాశాడు. మా చెల్లెళ్ళందరికీ ఫోనుచేసి వాడు వస్తున్నాడని చెప్పాను.

కొత్త సంవత్సర ప్రవేశపు హడావిడి అయ్యాక ఫ్యాక్టరీలో పని ఎక్కువయింది. చాలా బిజీగా ఉండి ఆలస్యంగా ఇంటికి వచ్చాను. వంటావిడ జ్వరం అని ముసుగుపెట్టిందిట. ముందు చెప్పలేదేం అని అత్తగార్ని అడిగితే "వంట వేళకి లేస్తుందేమోననుకున్నాను" అన్నారు. ఫ్రిజ్జు తీసి చూస్తే ఒక్క కూరకాదు కదా పచ్చిమిరపకాయలు కూడా లేవు. అందరిమీదా అరుస్తూ బుట్టలో ఉన్న నాలుగు బంగాళదుంపలు వేయించి చింతకాయపచ్చడి నూరి చారు పెట్టాను. (మా ఇంట్లో పెద్ద కరివేపాకు చెట్టుంది. ఎంత చారయినా పెట్టుకోవచ్చు).

పొద్దుటి పాలు ఎవరూ తోడు పెట్టలేదు. ఫ్రిజ్జులోను పెట్టలేదు. దాంతో ఆ పూటకి మజ్జిగ లేనట్లే. మా ఆయన నన్ను చూసి భయపడి మాట్లాడకుండా తినేసి వెళ్ళి పడుకున్నారు. నామటుక్కు నాకు మా ఆయన భోజనం అయిపోతే ఇంట్లో పనులన్నీ అయిపోయినట్లే! ఏదో ఒకటి తినేసి తలుపులన్నీ వేసి పడుకున్నాం. నిద్రపట్టబోతుండగా కిటికీ దగ్గర అలికిడయినట్లయింది. ఎవరో దొంగలొచ్చినట్లు న్నారండీ! మసుల్తున్నారూ" అని మా ఆయన్ని లేపాను. ఇంకా పదకొండవలేదు. ఇంత పెందరాడే ఏ దొంగా రాడు" అన్నారు. ఇంతట్లోకీ "అక్కా! నేను! రవిని. తలుపు తీయండి" అని వినిపించింది.

"మీ తమ్ముడొచ్చినట్లున్నాడు! వెళ్ళు" అని లైటు వేశారు. "వస్తున్నా నాన్నా" అని బయటకు పరిగెత్తాను. తలుపు తీసి చూస్తే మూడు రోజులు ప్రయాణం చేసి చేసి తుక్కయిపోయి, ఇంటికొచ్చిన బిడ్డ! నా గుండె నీరయిపోయింది. ఈ వేళ ఆరో తారీకా! ఎలా మర్చిపోయామందరం! ఇంకా ఏడాదన్నా కాలేదు. ఓ ఎదురు చూసేవాళ్ళు లేరు. బల్లమీద ఉసిరి ఆవకాయలేదు. బీరకాయ కూర లేదు. కమ్మటి పెరుగు లేకపోతేమానె పుల్లమజ్జిగన్నా లేదు. ఎంత దుఃఖం వచ్చిందో! అమ్మ లేనంత మాత్రాన ఇంత దారుణంగా ఉంటుందా?" అను కుంటూ వాడ్ని పట్టుకుని "అమ్మలేదుగదరా కన్నా! ఇంక అంతా కరువే" అని బావురుమన్నాను.

-జాగృతి, జూన్, 2009

✦ ✦ ✦